

రాస్తారోకో చేసిన రైతులపై కేసులు

ప్రజాశక్తి - గండేపల్లి

రాస్తారోకో నిర్వహించిన రైతులపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం జడ్.రాగంపేట వద్ద రైతులు చేసిన ఆందోళనతో ప్రజలు ఇబ్బందికి గురవ్వడంతో కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ గండేపల్లి మండలం నీలాద్రిరావు పేట, తాళ్లూరు, జడ్.రాగం పేట రైతులు ఆదివారం 16వ నెంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం పోలీసుల హామీతో వారు రాస్తారోకోను విరమించారు. ఈ నేపథ్యంలో పోలీసులు రైతులపై కేసులు మోపడం చర్చనీయాంశమైంది.

ఆర్‌టిసి బస్టాండ్‌లో అదనపు వసూళ్లు

- తాగునీరు, తిను బండారాలు, శీతల పానియాలపై రూ.5 నుంచి రూ.10 వరకూ అదనం
- వినియోగదారులు గగ్గోలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


కాంప్లెక్స్‌లో దుకాణాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆర్‌టిసి బస్టాండ్లలో పలు దుకాణాల నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎంఆర్‌పి ధరలకు అదనంగా రూ.5 నుంచి రూ.10 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. వాటర్ బాటిళ్లు, శీతలపానియాలు, బిస్కెట్ ప్యాకెట్లు ఇతర వివిధ తినుబండారాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులపై నిత్యం ఈ అదనపు బాదుడు తప్పడం లేదు. ఇంత జరుగుతున్నా అధికారుల పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వారి పర్యవేక్షణ లేక దుకాణదారులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు అంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 ఆర్‌టిసి డిపోల పరిధిలో 44 బస్టాండ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 330 వరకూ వివిధ దుకాణాలు ఉన్నాయి. ఈ బస్టాండ్‌ల నుంచి ప్రతి రోజూ సుమారు 5.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. పండగ వేళల్లో అయితే ఈ సంఖ్య 8 లక్షలకు పైగా ఉంటుంది.

ధరల మోత....

ఆర్‌టిసి టికెట్ ధరల పెంపు భారంతో ఇప్పటికే సతమతమవుతున్న ప్రయాణికులపై బస్టాండ్లలో అదనపు బాధుడుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. సరకుల ధరలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. 500 మిల్లీలీటర్ల కూల్ డ్రింక్ రూ.40 ఉంటే బస్టాండ్లలో రూ.45 నుంచి రూ.50 వరకూ వసూలు చేస్తున్నారు. వాటర్ బాటిల్ రూ.20 ఉంటే రూ.25, వాటర్ ప్యాకెట్ రూ.1కి బదులు రూ.3, టీ రూ.10కి బదులు రూ.15, కాఫీ రూ.25, చిప్స్, పాప్ కార్న్ రూ.10 నుంచి 20 ఉండగా రూ.20 నుంచి 30, బిస్కట్ ప్యాకెట్ రూ.20కి రూ. 25 వసూలు చేస్తున్నారు. ఇలా అన్నింటిపైనా ఇక్కడ అదనపు ధరలు అమలవుతున్నాయి.

కనిపించని పర్యవేక్షణ

అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని, ఫిర్యాదు చేయాలని హెచ్చరికల బోర్డులు ఉన్నా వాటిని ఆచరించే వారు కరువయ్యారు. నిబంధనలు పాటించేలా పర్యవేక్షణ చేసే వారు కనిపించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వివిధ పానీయాలు, తినుబండారాల నాణ్యతను పరిశీలించడంతోపాటు అవి ఎంఆర్‌పి ధరలకు అమ్మేలా తూనికలు, కొలతల శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే ఫిర్యాదులు అందినప్పుడు మాత్రమే అప్పుడప్పుడూ పరిశీలన జరిపి ఆ తర్వాత నుంచి పట్టించుకోవడంలేదనే విమర్శలు వారిపై ఉన్నాయి. ఆహార భద్రత నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు జరుపుతున్నారా లేదా.. అనే అంశాలపై కూడా అధికారులు సరైన పరిశీలన చేయడం లేదని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.

ఎంఆర్‌పికి మాత్రమే అమ్మేలా చూడాలి



పలు బస్టాండ్లలో ఉన్న దుకాణాల్లో సరుకులను ఎంఆర్‌పి ధరలకంటే అదనంగా వసూలు చేస్తున్నారు. దుకాణాల యజమానులంతా కుమ్మక్కై వీటిని అమలు చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం సరికాదు. కావునా శీతల పానీయాలు, తినుబండారాలు ఎమ్మార్పీ ధరలకు అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆందోళన చేపడుతాం.

- దూసర్లపూడి రమణ రాజు, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, కాకినాడ


సభలో మాట్లాడుతున్న మంత్రి వేణు

బిసిలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

బిసిలుఅన్ని రంగాల్లోనూ రాణించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆదిఆవరం కాకినాడలో స్థానిక విద్యుత్ నగర్, ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన జరిగింది. సంఘం అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి వేణు ముఖ్యఅతిథిగా, కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బిసి సంక్షేమ భవన నిర్మాణానికి కాకినాడలో స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. వనమాడి కొండబాబు, పిల్లి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ బిసిల అభివృద్ధికి, సంక్షేమానికి తమ వంతు సాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథి మంత్రి వేణు మాట్లాడారు. బిసిల సంక్షేమానికి సిఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. బిసిలను బ్యాక్ బోన్‌గా మార్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. బిసిలంతా ఐక్యతతో చైతన్యవంతులై అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం,ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రామరాఘవ మాట్లాడుతూ వన సమారాధనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు ముళ్ల సత్యనారాయణమూర్తి, అసోసియేషన్ జోన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.శ్రీధర్, రీజినల్ ప్రెసిడెంట్ కె.నాగరాజు, స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దొమ్మేటి సుధాకర్, పలువురు ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

వడ్లమూరులో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వడ్లమూరు సచివాలయం వద్ద ఆదివారం పెద్దాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.బెన్నయ్యనాయుడు ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ సారథ్యంలో జరిగిన ఈ సదస్సులో చట్టాలపై న్యాయవాదులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సదస్సులో ప్యానల్ న్యాయవాదులు మడికి రాంబాబు, ఎస్.విశాలాక్షి బాలికల సంరక్షణ, బాలికా విద్య, బాల్య వివాహాల వల్ల నష్టాలు, దిశ యాప్ వల్ల ఉపయోగాలు, రక్షణ, మహిళల చట్టాలు, రోడ్డు ప్రమాదాలకు కారణాలు తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, మాసా చంద్రరావు, ఆకుల మురళీకృష్ణ, కుంచే నాని బాబు, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది రాంబాబు

సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రారంభించి సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 7న చేపట్టనున్న 'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు కాకినాడ రూరల్ మండలంలో ఉన్న అన్ని గ్రామాల నుంచి తరలొచ్చి విజయవంతం చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్, అలాగే ఇతర సౌకర్యాలు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు మాదిరిగా ఆంధ్ర రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా ప్రసూతి, సహజ, ప్రమాద మరణాలకు పరిహారాలను వర్తింపజేయాలన్నారు. ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులందరూ ఓట్లేసి గెలిపించాలని జగన్ కోరారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నిధులను దారిమళ్లించారన్నారు. ఈ చలో కలెక్టరేట్‌కు పోలీసుల అనుమతి ఉందన్నారు. అయితే ఆదివారం అనుమతులు ఇచ్చిన పోలీసులే వచ్చి అనుమతి లేదంటూ ముందస్తు నోటీసు ఇచ్చారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి వైఖరి సరికాదన్నారు. పోలీసులతో ఉద్యమాలను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమేనన్నారు.

9 నుంచి స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఈనెల 9 నుంచి 15 వరకు అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగంలో స్కూల్ గేమ్స్‌కు సంబంధించి వివిధ విభాగాల్లో క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ సెక్రటరీ బివివిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు వీటిలో పాల్గొనొచ్చన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిని డి.సుభద్ర పర్యవేక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు అండర్-14 అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జరుగుతాయి. అండర్-14లో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 1, అండర్-17కు సంబంధించి 2006 జనవరి 1 తరువాత జన్మించి ఉన్నవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. 9న అండర్-17 బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, త్రో బాల్‌లో ఎంపికలు ఉంటాయన్నారు. 10న అండర్-14 బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, త్రో బాల్‌లో 11న అండర్ -14, అండర్-17 బాలబాలికలకు బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, హాకీ, జిమ్నాస్టిక్స్, టెన్నిస్, స్విమ్మింగ్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్, జూడోలో, 12వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు జన్మభూమి పార్క్ స్కేటింగ్ రింగ్ వద్ద అండర్-11, 14 ,17 బాల బాలికల ఎంపికలు, 13న ఉదయం 6 గంటలకు రోడ్ ఈవెంట్స్ ఎంపికలు, 14న అండర్ -17 బాల బాలికలకు ఆర్చరీ, అండర్-14, అండర్ 17 బాల బాలికలు రెజ్లింగ్, టెన్నికాయిట్, తైక్వాండో ఎంపికలు, 15న అండర్-14 బాలబాలికలు అథ్లెటిక్స్, అండర్-14, అండర్-17 బాలబాలికలకు రైఫిల్ షూటింగ్‌లో ఎంపికలు ఉంటాయన్నారు. జిల్లా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో ఈ ఎంపిక పోటీలుంటాయన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌ల ఆధ్వర్యంలో ఎంపకలు జరుగుతాయని తెలిపారు.

ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యత

మెగా జాబ్‌మేళాలో కాకినాడ ఎంపీ వంగా గీత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చదువు కున్న యువతకు మంచి ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని ఎంపీ వంగా గీత తెలిపారు. ఆదివారం స్థానిక పిఆర్ ప్రభుత్వ కళాశాలలో ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వికాస సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ సిటీ నియోజక వర్గ పరిధిలోని యువత కోసం మెగా జాబ్‌మేళాను నిర్వమించారు. ఈ కార్యక్రమంగా ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ముఖ్యఅతిథులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా ప్రోత్సాహం, ఫీజు రీజురీయింబర్స్‌మెంట్ వంటి వాటికి వైఎస్ఆర్ నాంది పలికితే, ఆయన కుమారుడు ముఖ్యమంత్రి జగన్ వాటిని మరింత ముదంఉకు తీసుకెళు న్నారన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల మాద్యమాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారన్నారు. విద్యాప్రమాణాల్లో రాష్ట్రం దేశంలో 8వ స్థానానికి దిగువలో ఉండేదని, ప్రస్తుతం 2వ ర్యాంకులో నిలిచిందన్నారు. మూడేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాలో 23 వేల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. కాకినాడ సిటీ నియోజక వర్గ పరిధిలో 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంగా మెగాజాబ్ మేళాను నిర్వహిస్తున్న వికాస, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్‌లను అభినందించారు.

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగాల కల్పన కోసం ప్రతి నెలా ఒక నియోజకవర్గ పరిధిలో జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేళాలో సుమారు 3 వేల మందికి ఉద్యోగావకాశాలను కల్పించేందుకు 64 కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీల సహకారంతో 250 మంది వికలాంకుగకు ఉద్యోగాలకు కల్పిస్తామన్నారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, రిజర్వులిస్ట్ పెట్టాలని కంపెనీలను కలెక్టర్ కోరారు.

కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి మాట్లాడుతూ 5 ఏళ్ల క్రితం ఇదే రోజున జగన్ ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించారని తెలిపారు. ఈ యాత్రలో చదువుకున్న యువత ఉద్యోగాలు లేక పడుతున్న అవస్థలను ఆయన గమనించారన్నారు. అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలో 4 లక్షల మంది యువతీ యువకులకు వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించారన్నారు. అలాగే రాష్ట్రం ప్రారంభించే సంస్థల్లో స్థానికులకు 75 శాతం కేటాయించేలా తొలి అసెంబ్లీ సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేవారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ జియో, ఎయిర్ టెల్ తదితర కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందిన వికలాంగకలుకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో వికాస పీడీ కె.లచ్చారావు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డి.వీరభద్రారెడ్డి, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటరు నల్లబిల్లి సుజాత, పిఆర్. కాలేజి పూర్వ విద్యార్థుల సంఘం అద్యక్షులు కె.భామిరెడ్డి, పిఆర్ కాలేజి ప్రిన్సిపల్ తిరుపణ్యం, వివిధ కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు.


నియామక పత్రాలను అందిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎంపీ వంగా గీత తదితరులు

రంగరాయలో షటిల్ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో ఆధునికీకరించిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్ట్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నర్సింహం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య భూమిక పోషించిన డాక్టర్ శేషగిరిరావు మాట్లాడుతూ ఈ ఆధునికీకరన పనులకు రంగరాయ పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ సూర్యరాజు, డాక్టర్ భాస్కర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3.30 లక్షలు ఇచ్చారన్నారు. మిగిలిన ఖర్చులు రంగరాయ వైద్యులు ఠాగూర్, ముఖర్జీ, సుధీర్, భానుప్రకాష్, కాటన్ అందించారని తెలిపారు. షటిల్ కోర్టు పనులు పర్యవేక్షణ బాధ్యత డాక్టర్ అడ్డాల సత్యనారాయణ చేపట్టారని తెలిపారు. అందరి చేయుతతో ఈ షటిల్ కోర్ట్‌ని సింథటిక్ మ్యాట్‌తో ఏర్పాటు చేసుకోగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాడ్రేవు రవి, డాక్టర్ చిట్ల కిరణ్, డాక్టర్ జిఎస్.మూర్తి, డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ రజని దీప, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.




షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ నర్సింహం

కాండ్రకోటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం కాండ్రకోటలో భార్గవ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు, వైద్య సిబ్బంది వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పన్నుల రూపంలో మీరే చెల్లించాలి..!!

లయన్స్ ఆధ్వర్యంలో 'సంతోషం'

ప్రజాశక్తి -తాళ్లరేవు

కార్తీక వన సమారాధన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంతోషం పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్‌టి.రాజు బంగ్లా ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో తూరంగి, కాజులూరు, తాళ్లరేవు, గొల్లపాలెం క్లబ్బుల నుంచి లయన్స్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఆటపాటలతో అలరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి జోనల్ చైర్మన్ జి.సత్యనారాయణరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్ బాదం బాలకృష్ణ, ఉప గవర్నర్ వేలూరి సూరిబాబు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సతీష్ రాజు, వినోద్, దూళిపూడి బాబి, చోడే శ్రీనివాస్, మాలతి వసుంధర, కృష్ణ, చౌదరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న బాదం బాలకృష్ణ

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రను ప్రారంభించి ఐదేల్లు పూర్తయిన సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసిమంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మున్సిపల్ సెంటర్లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్, చింతా శ్రీనివాసరావు,పండు,సిద్ది బాబ్జి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గంపేట నుంచి పవన్ పోటీకి రంగం సిద్ధం

లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తాం

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూర్యచంద్ర

ప్రజాశక్తి - గండేపల్లి

వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గం నుంచి జెఎస్‌పి అధినేత పవన్ కళ్యాణ్‌ను పోటీ చేయించి, లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. ఆదివారం జడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఆత్మీయ కలయిక సమావేశం సూర్యచంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో 242 బూత్ కమిటీలు ఉన్నాయన్నారు. ఒక్కోదానికి ముగ్గురు చొప్పున ఇన్‌ఛార్జిలుగా నియమించామన్నారు. ఆ బూత్ పరిధిలో ఓటర్లకు కమిటీ ఇన్‌ఛార్జిలు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో వచ్చిన ఓట్లు ప్రామాణికంగా తీసుకొని జనసైనికుల సహాయ సహకారాలతో జగ్గంపేట కోటలో జనసేన పార్టీ జెండా ఎగరవేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గోకవరం మండలం అచ్యుతాపురంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి ఆమరణ దీక్ష, జగ్గంపేట మండలం వెంగాయమ్మపురంలో ఉపాధి కూలీల సమస్య పరిష్కారానికి, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి వారి వెన్నంటే ఉన్నామన్నారు. పవన్ కళ్యాణ్‌పై విశాఖలో జరిగిన సంఘటన నుంచి జెఎస్‌పి పట్ల ప్రజల్లో మరింత ఆదరాభిమానాలు పెరిగాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఒక్కసారి ఆలోచించి పవన్‌ను పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాటంశెట్టి శ్రీదేవి, రామకుర్తి నరసింహ, వెంకన్నబాబు, రాజు, బొద్దిరెడ్డి శ్రీనివాస్, గోకాడ రాజు, దొడ్డ శ్రీను, లంకపల్లి భవాని, గవర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర



మొక్కలను పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

వన సమారాధనలో మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వివిధ గ్రామాలలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామాజిక వర్గాల వారీగా వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. పాలంగి షిరిడి సాయిబాబా ఆలయ సమీపంలో పాలంగి శ్రీ వాసవి మాత ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తులసి, ఉసిరి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కొర్లేపర సుబ్బారావు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట ఉండేలా, ఆరోగ్యాన్ని చేకూర్చే ఉసిరి, తులసి మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సింహాద్రి గుప్త, సభ్యులు ముత్తా రాజేశ్వర రావు, పచ్చిపులుసు పుల్లేశ్వరరావు, అత్యం మూర్తి, గమిని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తాడిపర్రు గ్రామంలో బ్రాహ్మణులు సమారాధన నిర్వహించారు.



స్థానికులతో మాట్లాడుతున్న మద్దిపాటి

బాధిత కుటుంబాలకు మద్దిపాటి పరామర్శ

ప్రజాశక్తి-గోపాలపురం

టిడిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో బాధ్యతగా పనిచేయాలని పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. గోపాలపురంలో ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పిటిసి కొప్పాక అబ్బులు, సీనియర్ నాయకులు ముప్పిడి సుందర్రావు, షేక్ హుమాయున్ మనవరాలు మృతి చెందగా వారి కుటుంబాలను స్థానిక నాయకులతో కలిసి మద్దిపాటి పరామర్శించారు. అనంతరం ఆయన స్థానిక యువతతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో యువత రాజ్యాధికారమే ధ్యేయంగా ఐక్యమత్యంతో పని చేయాలని ఆయన సూచించారు. ముందుగా ఎర్రంపల్లేమ్మ గుడి వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఈలి శరత్ బాబు, మద్దిపాటి రమేష్, మాజీ సర్పంచ్ తానేటి వీరరాఘవులు, రాపాక జయరాజు, కూనపోం ప్రసాద్ బాబు, కొడవటి గంగరాజు, కొడవటి పెద్ద వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరుటూరి వన సమ్మేళనం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రు గోదావరి పుష్కర్ ఘాట్ గంటాలమ్మ గుడి ప్రాంతంలో ఆదివారం కరటూరి వెల్ఫేర్ అసోసియేషన్ తణుకు వారి వన సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఆత్మీయ సమ్మేళనం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కుటుంబ సభ్యులతో ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆత్మీయతను పంచుకున్నారు. కరటూరి కుటుంబం జిల్లాలో పలు ప్రాంతాల నుండి కాక ఇతర రాష్ట్రాలలో పలు విభాగాల్లో స్థిరపడిన డాక్టర్స్ ఇంజనీర్స్ నాయకులు కార్తీక వన సమారాధన ఆత్మీయ సమ్మేళనానికి వచ్చారు. సుమారు 1500 మంది వరకు కుటుంబ సమేతంగా వన సమారాధనలో పాల్గొన్నారు. సుధీర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి ఆప్యాయత అనురాగాలతో సాయంత్రం ఆటపాటలు క్విజ్ పోటీలతో గోదావరి పరీవాహక ప్రాంతంలో మిత్రులతో గడిపి ఆప్యాయతను చాటుకున్నారు.

ఇంధన వనరుల వినియోగంపై అవగాహన

ఎన్‌రెడ్‌క్యాప్ పీడీ రామరాజు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఇంధనవనరుల వినియోగంపై ప్రజలు అవగాహన పెంచుకుని వాటిని ఉపయోగించుకోవాలని న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ రెడ్ క్యాప్) జిల్లా పీడీ పివి.రామరాజు అన్నారు. తరగని ఇంధన వనరులను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వ సబ్సిడీలతో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సోలార్ వీధి దీపాలు, సోలార్ ఇంటి దీపాలను విద్యుత్ సదుపాయం లేని చోట్ల సైతం కూడా అమర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిని అటవీ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పలు అంశాలను ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

సోలార్ ద్వారా ఉపయోగాలు ఏమిటి.?

సోలార్ పలకలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులకు విద్యుత్ పెట్టుబడి ఆదా అవుతుంది. తద్వారా గ్రీన్ ఎనర్జీ వస్తుంది. వాతావరణంలో కాలుష్యం కూడా తగ్గుతుంది. సోలార్ ద్వారా మన విద్యుత్ మనమే పొదుపు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. ఒకసారి ఏర్పాటు చేసుకున్న సోలార్ పలకలు 25 సంవత్సరాల వరకు పనిచేస్తాయి.

ఒక గహవినియోగానికి ఎంత ఖర్చు అవుతుంది.?

ఒక సాధారణ గహానికి సోలార్ ఏర్పాటుకు సుమారు రూ.1.5 లక్షల పెట్టుబడి ఖర్చవుతుంది. 3 కిలోవాట్స్ యూనిట్స్ కరెంటు అవసరం ఉంటుంది. ఇలా విద్యుత్ ఆదా వల్ల నాలుగేళ్లలోనే పెట్టుబడి ఖర్చు మిగులుతుంది. ఒక కిలోవాట్ కరెంటు కోసం 100 అడుగుల పలకలను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. నీడ పడని ఏరియాలో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు.?

జిల్లాలో మూడేళ్ల క్రితం 10 భవనాలకు మా సంస్థ ద్వారా సోలార్ సిస్టం ఏర్పాటు చేశాం. కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లవరం మండలం ఓడలరేవు జిల్లా పరిషత్ పాఠశాలకు, శంఖవరం మండలం మోడల్ స్కూల్, రాజమహేంద్రవరంలో కోర్టు కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశాం.

సోలార్ వీధి లైట్ల పనితీరు ఎలా ఉంది.?

పుదుచ్చేరి రాష్ట్రం యానాం, పి.గన్నవరం మండలం పశువుల్లంకలలో సుమారు 250 సోలార్ స్ట్రీట్ లైట్లను గతంలో ఏర్పాటు చేసాం. ఒక్కో దానికి సుమారు రూ.21 వేల ఖర్చుతో వీటిని అమర్చాము. 12 గంటలు వెలిగి



ఉండేలా టైమర్ బాక్స్‌లను ఏర్పాటు చేశాము. ఎవరైనా ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదిస్తే నెడ్ క్యాప్ సంస్థ ద్వారా వీటిని అమరుస్తాము.

విద్యుత్ వాహనాలు పని తీరు ఎలా ఉంటుంది.?

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 10 వేల విద్యుత్ వాహనాలు (ద్విచక్ర, కార్లు) ఉన్నాయి. ఒకసారి ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. ఇప్పటి వరకూ కారుకు 6 గంటల పాటు ఛార్జ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు 45 నిమిషాల్లోనే చేయవచ్చు. త్వరలో ఎంపిక చేసిన కొన్ని చోట్ల ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. వీటి ఏర్పాటుకు తమ సంస్థ సహకారం ద్వారా ప్రైవేటు వ్యక్తులు ముందుకు వస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఎన్ని ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు.?

జిల్లాలోని 13 ప్రాంతాల్లో విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎన్ రెడ్ క్యాప్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. తొలుత ఆర్‌టిసి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

నీట మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మతి చెందిన సంఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు కథనం ప్రకారం ఎస్.కొత్తపల్లికి చెందిన అంగాని సత్యనారాయణ (45) వివాహితుడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యనారాయణ గ్రామంలోని అల్లిపర్ర వద్ద మురుగు కాలువలో చేపల కట్టు దగ్గరకు శనివారం సాయంత్రం వెళ్లి ఉదయం వరకు రాకపోవడంతో కుటుంబీకులు అతని కోసం గాలించారు. చేపల కట్టు వద్ద సత్యనారాయణ నీట మునిగి శవమై కనిపించాడు. మతుని కుమారుడు గోవిందరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీ యాక్ట్‌లో జైలు శిక్ష

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాలతో పలు సారా కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధించారు. ఆదివారం కోరుకొండ ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సారా కేసుల్లో పలుమార్లు పట్టుబడి, మరలా సారా అమ్మకాలకు పాల్పడుతున్నందుకు ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన తలారి బేబీ పై ఆదివారం పిడి యాక్ట్‌ను అమలు చేశారు. సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ తలారి బేబి పై ఒక్క సంవత్సరం జైలు శిక్ష అమలులో ఉంటుందన్నారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాలలో ఎవరైనా సారా అమ్మకాలు చేయటం, సారా తయారు చేయడం, రవాణా చేయటం చేస్తూ, మానకుండా ఉన్నవారు కఠినమైన శిక్షకు గురవుతారని హెచ్చరించారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరం రాజా పబ్లిక్ స్కూల్ వెనుక వీధిలో కొంతకాలంగా డ్రైనేజీ లేక అక్కడ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు దృష్టికి ఆ వీధి ప్రజలు తీసుకువచ్చారు. ఈ డ్రైనేజీ సమస్యను స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు దృష్టికి ఎంపిపి తీసుకెళ్లారు. ఎంఎల్ఎ ఆదేశానుసారం ఆదివారం డ్రైనేజీ నిర్మాణానికి సుంకర శ్రీవల్లి వీరబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ కార్యదర్శి వరసల ప్రసాద్, పులపర్తి బుజ్జి, చిటికెల పాండు, పల్లెలు బాబి, శ్రీను పాల్గొన్నారు.



ల్యాబ్ ప్రారంభోత్సవం

నాణ్యమైన సేవలతో గుర్తింపు

ప్రజాశక్తి-తాళ్లపూడి

వివిధ రకాల వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌కు వచ్చే ప్రజలకు మంచి సేవలు అందిస్తూ గుర్తింపు పొందాలని జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ అన్నారు. మండలంలోని ప్రక్కిలంకలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన యాపిల్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ఆదివారం శ్రీలేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబ్ యజమాని నరేష్ వర్మ మాట్లాడుతూ ప్రజలు వైద్య పరీక్షల కోసం ద్వారా ప్రాంతాలకు వెళ్ళక్కర్లేకుండా అత్యాధునిక యంత్ర పరికరాలతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో గంటల వ్యవధిలోనే రిపోర్టులు అందజేస్తామని అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో ఒఎన్‌జిసి ఉద్యోగి ఒబిసి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎల్ఎస్.రాజు, ఎపి స్టేట్ టెక్నికల్ బోర్డు కార్యాలయ సిబ్బంది ఆర్.బాపిరాజు, రాజానగరం స్టేషన్ ఎఎస్ఐ శ్రీనివాస్, తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, యాళ్ల బాబూరావు, టిడిపి నాయకులు ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మండపేట



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తోట

మండలంలోని ఏడిద గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఏడిద సొసైటీలో ప్రారంభోత్సవంలో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ రైతుకు మద్దతు ధర కలిగించేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నూతన విధానాలు అవలంబిస్తోందన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ తులసి మాట్లాడుతూ 2022-23 ఖరీఫ్‌కు 331 రైతు భరోసా కేంద్రాల ద్వారా 3.53 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా ఉందన్నారు. 100 కేజీల ఏ-గ్రేడ్ ధాన్యం రూ.2060, సాధారణ రకం రూ.2040 చొప్పున కొనుగోలు చేస్తామని తులసి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కలశాల పూజలో పాల్గొన్న ఎంఎల్ఎ చిర్ల

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం మండలం గోపాలపురంలో నిర్వహించిన కలశాల పూజలో ఎంఎల్ఎ, ప్రభుత్వ ఛీఫ్ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఎంఎల్ఎ చిర్ల స్వగృహంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అయ్యప్ప దీక్షాపరులు వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.

నిలిచిపోయిన ఉపాధి హామీ పనులు

- 640 మంది కూలీల ఎదురుచూపు
- రూ.30 లక్షల పనులు జరగని వైనం
- స్పందించని అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -రామచంద్రపురం

ఉపాధి హామీ పనులు గత ఆరు నెలలుగా నిలిచిపోయాయి. ఉపాధి హామీ పనుల కోసం కూలీలు ఎదురుచూస్తునన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించి వారికి కొంత సొమ్ము అందించాలని పట్టణ ప్రాంతాలకు వలసలు తగ్గించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్రం రూపొందించింది. దీనిని అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున 2005లో ప్రారంభించారు. ఈ పథకం ప్రకారం కూలీలకు కనీసం వంద రోజులు పని దినాలు కల్పించాలని పనిలేదని అభ్యర్థించిన కూలికి 14 రోజుల్లో గా పని కల్పించకపోతే కొంత నగదు చెల్లించాలని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది రాజపురం నియోజకవర్గం లోని తోటపేట గ్రామపంచాయతీ పరిధిలో మే నెల నుండి 6 నెలలుగా ఇక్కడ ఉపాధి హామీ పథకం పనులు నిలిచిపోయాయి ఇక్కడ పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ అభ్యంతరంగా మానివేయడంతో ఇప్పటివరకు పనులు జరగలేదు. గ్రామంలో మొత్తం 32 గ్రూపులు ఉండగా 640 మంది కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ గ్రామంలో ఆరు నెలలుగా పనులు నిలిచిపోవడంతో కూలీలు పలుమార్లు అధికారుల దష్టికి తీసుకువెళ్లారు. అయినా ఫలితం లేదు దీంతో సుమారు రూ.30 లక్షలు విలువైన పనులు ఎంతవరకు పూర్తి కాలేదు కనీసం కూలీలకు పని కల్పించగా పోవడం వల్ల పరిహారం చెల్లించలేదు. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి అని కూలీలంతా ఎదురుచూస్తున్నారు. మరో మూడునెలల్లో ఈ ఏడాదిలో ఉపాధి హామీ పనులు పూర్తికావాల్సి ఉండగా ఇప్పటికీ అవి పూర్తికాలేదు. ఎప్పటికైనా అధికారులు స్పందించి తోటపేటలో కూలీలకు పనులు కల్పించాలని, దీనిపై అధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ నియమించాలని దీనికి సీనియర్ మేట్లలో ఒకరిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించే వీలున్నప్పటికీ రాజకీయ నాయకుల వత్తిడితో ఎంతవరకు ఆ పోస్ట్ ని ఖాళీగా ఉంచి కూలీలకు పనులు లేకుండా చేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

గ్రామంలో రాజకీయాలను పక్కనపెట్టి వెంటనే ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఎన్‌ఆర్‌జిఎస్ నిధులు సద్వినియోగం చేయాలని గ్రామస్తులు కూలీలు అధికారులను వేడుకుంటున్నారు.

అధికారులతో మాట్లాడి వివరాలు తెలియజేస్తా

తోటపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు ఆరు నెలలుగా నిలిచిపోవడంతో రామచంద్ర పురం ఎంపిడిఒ కీర్తి స్పందనను వివరణ కోరగా ఆ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేదని దీనివల్ల పనులు నిలిచిపోయాయన్నాఉ. తాను ఇటీవలే విధులకు రావడం వల్ల దీనిపై పూర్తి వివరాలు చెప్పలేనని సోమవారం దీనికి సంబంధించిన అధికారులతో మాట్లాడి వివరణ ఇస్తానని అన్నారు.



జొన్నాడ వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన ఊక లారీ

జాతీయ రహదారిపై ఊక లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

216 నెంబరు జాతీయ రహదారిపై మండలంలోని జొన్నాడ ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఆదివార ఊక లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. జొన్నాడ నుంచి ఊకలోడుతో వస్తున్న లారీ జాతీయ రహదారిపైకి వేగంగా వస్తోంది. ఈ క్రమంలో జొన్నాడ వద్ద గల డివైడర్‌ను దాటి రాజమహేంద్రవరం వైపు వెళ్లేందుకు తిరుగుతూ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ తో సహా అతని ప్రక్కన ఉన్న క్లీనర్ కి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. కాగా లారీ జాతీయ రహదారిపై అడ్డంగా పడినప్పుడు ఇతర వాహనాలు రాలేనందున ప్రమాదం తప్పిందని ఎఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. అలాగే ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా హైవే సిబ్బంది సహాయంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. అలాగే క్షతగాత్రులను ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ పై తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టారు.



ఎఎస్ఐవెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

నాటికలపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్



నాటికలు, నృత్యాలపై శిక్షణ ఇస్తున్న శ్రీనివాసరావు

సామర్లకోట మండలం మాధవపట్నం జమునానగర్ కాలనీ అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో విద్యార్థులకు నాటికలు, నృత్యాలపై ప్రజానాట్య మండలి కళాకారులు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ట్రస్టు కన్వీనరు అంగర గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ప్రజా నాట్యమండలి నాయకులు జె.శ్రీనివాసరావు బృందం, కల్చరల్ టీమ్ లీడర్ హేమంత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాల మందిరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పేరవరం గ్రామంలో అవగాహన ర్యాలీ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కె.భాను పిలుపునిచ్చారు. మండలంలోని పేరవరంలో సర్పంచ్ బేరి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను వివరించారు. అనంతరం ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బుగతా శివ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుని చేతిలో వజ్రాయుధం లాంటిదని అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను ఆయన వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.వెంకట్రావు, ఆకుల హరిబాబు, పిల్లి బలరాముడు, అవసరాల దేవి, ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.